"**అన్నింటి** కన్నా ప్రసన్నగారి వదనం అంటే నాకు చాలా ఇష్టం. ఎంతో ప్రశాంతంగా, చిరునవ్వు నవ్వుతూంటుంది ఆవిడ. మిగతా అంతా చెప్పాగా! చాలా మంచి కుటుంబం. సత్ సంప్రదాయం ఆయన ఆ "స్తి మాట అటుంచి ఆవిడకీ బోలె డుంది..."

"ఏమిటో...ఆవిడని అంత పొగిడేశావు?! అబ్బాయిని గురించి ఏమీ చెప్పవేం?"

"చెప్పాగా! బుద్ధిమంతుడూ, నెమ్మదస్తుడూనూ! తల్లితండ్రుల మాట జవదాటడు. ఈ కాలంలో అటువంటి కుర్రాళ్ళు చాలా అరుదు. అతను అల్లుడుగా వ స్తే మీరు చాలా అదృష్టవంతులు. ఇహ వెళ్తాను మీనాక్షీ చాలా సేపు కూర్చున్నా నీవేళ..." అంటూ లేచింది ప్రభావతి.

ప్రభావతీ, మీనాక్షీ చిన్ననాటినుంచీ స్నేహితురాళ్ళు. అదృష్టంకొద్దీ వారి భర్తలు కొలీగ్స్ కాబట్టి వారి స్నేహం బాగా అభివృద్ధి అయింది.

మీనాక్షి తన పెద్ద కూతురి కొడుక్కు భోగివళ్ళు పో సే పేరంటానికి పిలవటానికి ప్రభావతిగా రింటికెళ్ళినప్పుడు అక్కడ ప్రసన్నను చూడటం జరిగింది.ఆమెకు దగ్గర దగ్గర ఏభైఏళ్ళుంటాయి మో! అయినాకూడా వడలని మొహం, ఎప్పుడూ నవ్వుతూండే ఎర్రని పెదవులు, నున్నని తెల్లని చెక్కిళ్ళు ఆవిడకి ప్రసన్న తప్ప ఇంకే పేరూ నప్పదేమో అసలు!...'వయసుకన్నా అంత చిన్నగా కనబడటానికి కారణం-తక్కువమంది పిల్లలా? లేక...ఆవిడ భర్త...' అని తనలో తాను నవ్వుకుంది **మీనాక్షి**. వారి ఈ కలయికకి ముందే ప్రభావతి మీనాక్షికి అబ్బాయిని గురించి చెప్పినట్లు, ప్రసన్నకు అమ్మాయిని గురించి కూడా చెప్పింది.

"పిల్ల కొంచెం రంగు తక్కువే అయినా, ఎంతో అందంగా, కళగా ఉంటుంది. కొనదేరిన ముక్కు, నన్నని పెదవులు, చిన్న నోరు, మీనాల్లాంటి కళ్ళు, బాణాల్లాంటి కనుబొమలు-చూడ ముచ్చటగా ఉంటుంది. ఎంత నాజూగ్గా కనబడుతుందో, అంత ఒళ్ళొంచి పని పాటలు చేస్తూ, చదువుకుంది. బియె "స్స ఫైనల్ ఇయరు. యూనివర్సిటీ ఫస్టు వస్తుందని అంతా అనుకుంటున్నారు. ఆ పిల్ల కోడలుగా వ స్తే మీరు చాలా అదృష్టవంతులు" అంది.

ఇప్పుడు ప్రభావతి ఇంట్లో మీనాక్షీ ప్రసన్నా ఒకళ్ళ నొకళ్ళు కాబోయే వియ్యంకురాళ్లు అన్న దృష్టితో చూసుకున్నారు. పలకరించుకున్నారు.

"మీరీ మధ్యే వచ్చారుటగా? ఇల్లు సౌకర్యంగా ఉందా? మా ఊరు ఎలా ఉంది? నచ్చిందా?"

"మూ డు నెలలయ్యిందండీ..." అంది ప్రసన్న నవ్వుతూ, నన్న ని స్వరంతో. మిగతా ప్రశ్నలకి తన నవ్వే సమాధానం అన్నట్లు కొత్త ఊరుగురించి కొత్త పరిచ..స్తురాలితో ముభావంగా ఉంది ఆవిడ.

ఆవిడేమైనా ప్రశ్నలు వేస్తుందేమోనని కా స్సే పాగి, మళ్ళీ తనే పలకరిస్తోంది మీనాక్షి.

"మీ అమ్మాయి, అల్లుడు అమెరికాలో సెటిలయ్యారుటగా?" ప్రసన్న ఔనన్నట్లు తల ఆడించి నవ్వింది.

ఆవిడ ఎంత హాయిగా నవ్వుతోందో! మా అమ్మాయి ఎక్కడో అమెరికాలో ఉండి ఏ ఆరేళ్ళకో, ఏడేళ్ళకో వస్తూంటే తానలా నవ్వుతూండగలదా?" అనుకుంటూ "ఎన్నేళ్ళకోసారి వస్తారూ?" అంది.

కుడిచేతి అయిదు వేళ్ళూ తెరచి ఆవిడ మొహాని కెదురుగా పెట్టి'...ళ్ళకోసారి' అంది సగం మాట మింగే "స అని నవ్వుతూ. ఆ పైన వాళ్ళబ్బాయి గురించి ఏదైనా అడగాలన్నా, ఏమీ సరిగ్గా తట్టక, ఆవిడ చిరునవ్వుకి సమాధానంగా చిరునవ్వు తెచ్చి పెట్టుకుని కూర్చుంది కా సేపు ఆవిడ. అమ్మాయిని గురించి ఏమైనా అడుగుతుందేమోనని ఎదురు చూ "సింది కానీ ఆవిడ నిశ్శబ్దంగా నవ్వుతూ ఉండిపోవటంతో "వెళ్ళొస్తానండీ! వెళ్ళొస్తా ప్రభా! ఇంకా పిలవాల్సిన ఇల్లున్నాయి. పేరంటానికి తప్పకుండా రండి ప్రసన్నగారూ! మా ప్రభావతి ఇల్లు చూపిస్తుందిలెండి" అంటూ స్నేహపూర్వకంగా చూ "స, నవ్వి లేచి వెళ్ళిపోయింది మీనాక్షి.

ఆ రాత్రి భోజనాల దగ్గర వడ్డన చేస్తూ భర్తతోనూ, కూతుళ్ళతోనూ అంది.

"ఇవేళ ప్రసన్నగారిని చూశాను. ప్రభావతి చెప్పిన సంబంధం. ఆవిడ చాలా నెమ్మదస్తురాలిలా, సాధ్విలా ఉంది. పేరుకి తగ్గట్టు ప్రసన్నమైన మొహం. ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూంటుంది పావం!..."

మీనాక్షి భర్త కుటుంబరావు పకపకా నవ్వుతూంటే "నవ్వుతారేం?" అంది.

"నవ్వకేం చెయ్యమంటావ్? ఎప్పుడూ నవ్వుతూంటుంది. పా...వం" అంటే! నవ్వుతూండటం పావమా ఏమిటీ? నవ్వేవాళ్ళని చూ "సి పావ



# కేరికేచర్

ఆచంట ఉమాదేవి



అంటారా ఏమిటీ..." అన్నాడు. వనజ, గిరిజ కూడా నవ్వేశారు.

భోజనా లయ్యాక, రేపటి పేరంటానికి పాకెట్లు సర్దుతూ కూర్చున్నారు మీనాక్షీ, వనజ, గిరిజా.

"అదేమిటమ్మా! ఒంట్లో బాగుండలేదా? సాయంత్రంనించీ చూస్తున్నాను అలా దవడలు నొక్కుకుంటున్నావు. బుగ్గలు ఒత్తుకుంటున్నావు" అంది వనజ.

"ఏమిటోనే! జలుబు చేస్తోంది కాబోలు. మొహంలో కండరాలన్నీ పీక్కుపోతున్నాయి" అంది మీనాక్షి చెంపలు రెండూ చేతుల్లో పట్టుకుని.

ఆ తర్వాత మీనాక్షి దంపతులు, ప్రభావతి దంపతులు కలిసి "మా అమ్మాయిని చూసుకోటానికి రండి" అని సాంప్రదాయ సిద్ధంగా ఆహ్వానించటానికి ప్రసన్న ఇంటి కెళ్ళారు.

కబుర్లు, కాఫీలు అయ్యాక కుటుంబరావుగారు ప్రసన్న భర్తతో అన్నారు-"మాఅమ్మాయిని అక్కగారు చూశారు. ప్రభావతిగారు మావివరాలు, స్థితిగతులు అన్నీ చెప్పారు. మీ అబ్బాయి వచ్చినప్పుడు పెళ్ళి కూతుళ్ళ లిస్టులో మాఅమ్మాయిని కూడా వేసుకోండి. అబ్బాయి వచ్చినప్పుడు మాకు తెలియజేస్తే నేను స్వయంగా వచ్చి మీ అందరినీ మా ఇంటికి తీసుకెళ్తాను" అని.

ప్రసన్న భర్త నరసింహంగారు నవ్వేస్తూ, "అందరం ఎందుకండీ! అయినా, అసలు మావాడు కోడలు సెలక్షన్ బాధ్యత వాళ్ళమ్మ మీద పెట్టేశాడు. మా ఆవిడ మీ అమ్మాయిని చూడటం, అయింది కదా!" అన్నారు.

ప్రసన్నగారు సన్నగా నవ్వుతూ "శాస్త్రులుగారు శ్రావణందాకా ముహూర్తాలు లేవంటున్నారు" అనటంతో కుటుంబరావుగారు, మీనాక్షీ నిర్ఘాంతపోయారు.

"ఇంత తేలిగ్గా సంబంధం కుదిరిపోవటమే!" నమ్మలేకుండా ఉన్నారు వారు. వారి తరఫున ప్రభావతి భర్త సుదర్శనంగారు కల్పించుకుని-"ముందుగా మిగిలిన విషయాలన్నీ..."

"మిగిలిన విషయా లంత ముఖ్యం కాదండీ. మాకు మంచి సాంప్రదాయం గల కుటుంబమూ, నెమ్మదస్తురాలయిన అమ్మాయీ ముఖ్యం..." అన్నారు నరసింహంగారు.

వాళ్ళింటినించి ప్రభావతి ఇంటి కెళ్ళారు మీనాక్షి దంపతులు.

"వాళ్ళు వాళ్ళ ఇష్టాన్ని అంత త్వరగా, తేలిగ్గా చెప్పేశారు. కట్నకానుకలు వద్దంటూ, ముహూర్తాలదాకా వచ్చేశారు..."

"మీరేమో...ఇంకా ఆలోచిస్తున్నారు, అవునా! అంత తేలిగ్గా ఒప్పుకుంటే సందేహంగానే ఉంటుంది. కానీ మేము చెప్తున్నాంగా...అబ్బాయి వచ్చగా దబ్బపండు రంగులో ఠీవిగా ఉంటాడు. ఏ లోపమూ లేదు. మంచి ఉద్యోగమూ, ఆస్తి, అంతస్తూ" అంటూ మళ్ళీ తిరగదోడింది ప్రభావతి.

తల్లి చెప్పింది విని సిగ్గుల పెళ్ళికూతురయింది గిరిజ. "పిల్లవాడు బాగుంటాడట!" అన్న వాక్యమే ఆమె చెవుల్లో గింగురుమనసాగింది. ప్రతీ నిమిషం ఆ అబ్బాయిని గురించి ఆలోచిస్తూ మొహం ఊహిస్తూ గడిపింది రెండు రోజులు. మూడో రోజు తెల్లవారుతూండగా కలత నిద్రలో ఎంత అందంగా ఉన్నా అబ్బాయిని అసలు చూడకుండానే తను ఎలా ఒప్పుకుంటుందీ...ఊహుఁ...'అబ్బాయిని చూడాలి. చూసితీరాల్సిందే...' అనిపించింది. చూడకపోతే...అసలు

పెళ్ళి అన్న ఫీలింగ్ కలగదేమో అన్న అనుమానం వచ్చి అది భయమూ, బెంగగా మారేసరికి గిరిజ ధైర్యంచేసి తల్లిదగ్గరకి వచ్చింది.

"అమ్మా!..." తలెత్తి చూసింది మీనాక్షి.

"మరీ...మీరూ. అసలూ...వాళ్ళూ" అంది.

"వేళ్ళూ?"

"వేళ్ళూ గోళ్ళూ కాదు, నేనా అబ్బాయిని చూడనిదే పెళ్ళికి ఒప్పుకోను." తన కంత ధైర్యం ఎలా వచ్చిందో గిరిజకే తెలీలేదు. మీనాక్షి కళ్ళార్పకుండా కాస్సేపు నిలబడిపోయి తడి చేతులు తుడుచుకుంటూ భర్త దగ్గర కెళ్ళింది.

కుటుంబరావుకి అబ్బాయి వస్తున్నాడన్న వార్త అందిన రోజే నరసింహంగా రింటికి వెళ్ళాడు.

అవీ ఇవీ మాట్లాడాక "ఎంతయినా ఈ కాలంలో పిల్లని పిల్లాడు, పిల్లాడిని పిల్లా చూసుకోవటం మంచిదీ...అబ్బాయిని వచ్చి మాఅమ్మాయిని చూసుకోమనండి" అన్నాడు.

"అల్లాగే...అల్లాగే. మేమూ అలాగే అనుకున్నా అన్నా రాయన.

ఈసారి పెళ్ళిచూపులు ఇంట్లో జరగలేదు. అబ్బాయి ఫ్రెండునడిగి కారు తీసుకుని వచ్చాడు. అతను వచ్చే టైముకి అమ్మాయి ఫ్రెష్‌గా ముస్తాబై వీధి గేటు దగ్గర నిలబడింది. సన్నగా హారన్ చప్పుడవటం విని వరండాలో నిలబడ్డ కుటుంబరావుగారు, మీనాక్షీ గబగబా వెళ్ళి గేటు తెరిచి అమ్మాయిని కారుదాకా నడిపించుకు వెళ్ళారు. గిరిజ ఆ అబ్బాయి కారు డోరు తెరవగా, ఎక్కింది. కారు తలుపు పడేలా గట్టిగా వేసి, "కాఫీ టైముకి వచ్చేయండి" అన్నాడు కుటుంబరావు. 'త్వరగా వచ్చేయండి' అంటే బాగుండదని.

కారు వెళ్ళిపోయాక మీనాక్షి చాలా సంతోషంగా "చూడ ముచ్చటగా ఉన్నాడు పిల్లాడు. వినయం, విధేయతా, మేనర్సూ...మనకి చేయెత్తి దండం పెట్టాడు. అమ్మాయిని చూసి చిరునవ్వుతో 'హలో' అన్నాడు తలవంచి వందనం చేస్తున్నట్లు. మొదటి చూపుల్లోనే అతనికి గిరిజ నచ్చినట్లు తెలిసిపోయింది. మనమ్మాయికేం? మాణిక్యంలాంటిది" అంది భర్తతో.

సరిగ్గా ముందు కబురుచేసిన ప్రోగ్రామ్ తు.చ. తప్పకుండా గంటలోపులో తిరిగి తీసుకొచ్చాడు అబ్బాయి గిరిజను.

తనే ముందు కారు దిగి, అమ్మాయికి డోరు తెరచిపట్టుకున్నాడు.

కారు చప్పుడుకోసం చెవులు రిక్కించి ఉన్న ఆమె తలితండ్రు లిద్దరూ బయటి కొచ్చారు.

వాళ్ళ మొహంలోకి పరీక్షగా చూస్తూ అతనితో "లోపలికి రండి/కాఫీ తీసుకుని వెళుదురుగాని" అన్నాడు కుటుంబరావు. అబ్బాయి ముఖం ప్రసన్నంగా ఉంది.

అబ్బాయి గడియారం చూసుకుంటూ-"సారీ టైము లేదు. కారు ఫ్రెండు కిచ్చేయాల్సిన టైముకి సరిగ్గా పది నిముషాలే ఉన్నాయి. పైగా మేము కాఫీ తాగొచ్చాం" అన్నాడు గిరిజవైపు చూస్తూ నవ్వి.

"వస్తానండీ...బై!" అని స్టైలిష్‌గా నడుస్తూ వెళ్ళిపోయాడు.

కారు వెళ్ళిపోవటంతోనే లోపలి గదిలోంచి వనజ గబగబా వచ్చింది.

"ఎక్కడికి తీసుకెళ్ళాడూ? కాఫీ తాగారుటగా? ఏ హొటల్‌కి వెళ్ళారు?" అంది.

"ఏమన్నాడే? తప్పక ఉద్యోగం చేయాలి అన్న కండిషన్ పెట్టాడా?" అంటున్న తల్లిని మౌనంగా చూసి, తన గదిలోకి వెళ్ళిపోయింది గిరిజ.

కుటుంబరావూ, మీనాక్షీ, వనజా మొహాలు చూసుకుంటూ ఉండిపోయారు కాస్సేపు.

"సంగతేమిటో కనుక్కో" అని కుటుంబరావు వనజని గిరిజ గదికి పంపించాడు.

కాఫీ గ్లాసు తీసుకుని వెళ్ళిన వనజ -"గిరీ! కాఫీ తీసుకో. చల్లారిపోతుంది. అలా ఉన్నావేం?" అంది.

గిరిజ మాట్లాడకుండా కాఫీ గ్లాసు అందుకుని ఒక సిప్పు తాగి, గ్లాసుని దవడల దగ్గర, బుగ్గలకీ ఆనించుకుని, వేడి కాగుతూంది.

"ఏమిటే గిరిజా...ఒంట్లో బాగుండలేదా? అలా దవడలు ఒత్తుకుంటున్నావేం? జలుబు చేసిందా? పొద్దున్న బాగానే ఉన్నావే! ఆఁ...హడావిడిగా చన్నీళ్ళతో షాంపూ చేసుకున్నావు. అందుకే..."

"అబ్బా— ఊరుకో అక్కా! చన్నీళ్ళు నా కలవాటే" విసుగ్గా అంది గిరిజ.

"మరి...?"

"నీకు గుర్తులేదూ? అమ్మకూడా ఇలాగే దవడలు నెప్పెట్టాయి మొన్న ప్రసన్నగారిని పేరంటానికి పిలిచి వచ్చిన రోజు."

"అవునా! ఏమోనే!"

"గుర్తులేదూ! నాకు బాగా గుర్తుంది. అసలు పోనీ నువ్వెళ్ళి కాస్సేపు ఆవిడతోనైనా, అతనితోనైనా మాట్లాడిరా, తెలుస్తుంది."

"ఏమిటీ తెలిసేదీ?"

"ఏమిటా...ఇదొక జబ్బు! వాళ్ళిద్దర్లో ఎవరితో మాట్లాడినా అంతే దవడలు పట్టుకుపోతాయి."

ఎందుకనీ?"

"వాళ్ళ నవ్వుమొహం చూసి, మనమూ మనకి నవ్వురాకపోయినా బలవంతంగా బుగ్గల, దవడల, పెదిమల కండరాలని సాగదీసుకుని, మొహాన్ని ప్రసన్నంగా నవ్వుతున్నట్లు పెట్టి నటిస్తాం. కానీ అనవసరం. ఎందుకంటే వాళ్ళది నవ్వు మొహమే కానీ నవ్వు కాదు. నిద్రలో కూడా వాళ్ళ మొహం అలాగే ఉంటుంది. విచారంగా ఉన్నప్పుడూ, ఏదైనా చెడువార్త విన్నా కూడా అంతే! ఆ మొహంలో భావ ప్రకటన అదే!...నవ్వు చెరగదు. ఆవిణ్ణి గురించి అమ్మ 'ఎప్పుడూ నవ్వుతూంటుంది పాపం...' అనటం, నాన్నగారు పకపకా నవ్వటం గుర్తుందా పోనీ! అమ్మకీ ఎందుకో 'పాపం' అనాలనిపించింది. నిజంగా పాపం!!జాలేస్తుంది. అది నవ్వుకాదు. కండరాల లోపం. అతను 'అపహాస్యం' అన్న పదానికి గీయబడ్డ 'కేరికేచర్'లా ఉంటాడు. ఛీ...అసలూ మొగవాళ్ళు తెల్లగా ఉంటే ఏం బాగుంటారూ! పాడూ!"

"అదేమిటి చెల్లాయ్?"

"అదంతేనే అక్కా! నన్నింక ఎవరూ విసిగించవద్దు" దుప్పటిని మొహం మీదికి లాక్కుని పడుకుంది గిరిజ.




వనజ చెప్పినది విని నిర్ఘాంతపోయారు తల్లితండ్రులు. "ఇది మరీ బాగుంది. ఇది అబ్బాయికి నచ్చాలని వెయ్యి దేవుళ్ళని మొక్కుతున్నాను. అంత చక్కటి సంబంధం, దబ్బపండులాంటి పిల్లాడు...ఇలా వంకలు పెట్టి సంబంధాలు తిరగ్గొడితే ఎలా?"

మీనాక్షి మనసు విలవిలలాడింది.

కుటుంబరావుకు రేపొద్దున్నే వాళ్ళు ప్రభావతి గారితో 'మా అబ్బాయికి అమ్మాయి నచ్చింది. ముహూర్తాలు పెట్టి తెలియజేస్తాం' అని కబురు పెట్టినప్పుడు తను ఏం చేయాలీ? ఏ మొహంతో ఎలా చెప్పగలడు తను?' అన్న సమస్యలో అన్నంకూడా సహించలేదా రాత్రి. ఆ రాత్రి ఎవరూ నిద్ర పోలేదు.

పొద్దున్న అవుతూంటే అవుతుందంటే గిరిజ తల్లితండ్రులకి గుండెలు దడదడలాడసాగాయి.

అయినా తెల్లారక మానలేదు.

ఏ నిమిషంలో వాళ్ళు వస్తారో...అని బిక్కుబిక్కుమంటూ తిరగసాగార్రా ఇంట్లో మనుషులు.

ప్రొద్దు గుంకింది. మళ్ళీ తెల్లవారింది. అలా అయిదు రోజులు గడిచాయి. మరిన్ని రోజులు గడిచాక మీనాక్షికి ప్రభావతి కూరల మార్కెట్టులో కనబడి-

"ప్రసన్నగా రబ్బాయి పెళ్ళి! శుభలేఖ వచ్చిందా మీకూ?" అనడిగింది.

"మాకా! లేదే...ఎవరమ్మాయి?" సగం బాధ, సగం సంతోషంతో అంది.

"మేనరికమే! ఆవిడ అన్నకూతురు. పిల్ల బాగుంటుంది. పచ్చగా మేనత్త పోలికే...ఆ కళ్ళూ, ఆ నవ్వూ..." ప్రభావతి మాట్లాడుతూ, మాట్లాడుతూ మీనాక్షి మొహం చూసి ఠక్కున ఆగిపోయింది. ఒక్క క్షణం తర్వాత అంది:

"ఆ సంబంధం తప్పిపోయిందని బాధపడకండి- మీ అమ్మాయి కింకో నిక్షేపమైన సంబంధం రాకపోదు..."

"మేనరికం ఉండేవాళ్ళు, మాఅమ్మాయిని ఒప్పుకున్నట్లే ముహూర్తాలు పెట్టించటమే ఆలస్యం అన్నట్లు మాట్లాడారు..."

"అహఁ...మీ అమ్మాయి నచ్చింది అని అనలేదుగా! మావాడు బాధ్యత తల్లిమీద వేశాడు అనీ, మా ఆవిడ మీ అమ్మాయిని చూడటం అయింది కదా అనీ ఆయన అన్నారు. ఆవిడ ఇప్పట్లో ముహూర్తాలు లేవుట అంది. అంటే ఇప్పుడప్పుడే ఎందుకులెండి నిర్ణయించుకోవటం' అని ఆవిడ ఉద్దేశం కావచ్చు."

ప్రభావతి చిన్నప్పటి స్నేహితురాలైన తనని వదిలేసి, వాళ్ళ పక్షం మాట్లాడుతూంటే, మీనాక్షికి కష్టంగా తోచి మాట్లాడకుండా తలవంచుకుని వంకాయలు సంచీలో వేయించుకుంటూంటే త్రాసులో ఉన్న రెండు పుచ్చు వంకాయల నేరి పారేస్తూ ప్రభావతి

"అసలు మేనకోడలు ఒప్పుకుంటుందో లేదోనని వాళ్ళకి సందేహం ఉండి ఉంటుందిలే! అదికాకపోతే ఇదీ అన్నట్లు చూసి ఉంటారు! చేసుకోకపోతే మానేయొచ్చుకానీ 'పిల్ల రంగు తక్కువనీ, మూతి చాలా పెద్దది, చెవులదాకా ఉందనీ అబ్బాయి కామెంట్ చేయటం బాగుండలేదు. నాకు తెలీదూ మన గిరిజ..."

ఫక్కుమని నవ్వు వినిపించి పక్కకు తిరిగిన ప్రభావతి వంకాయలసంచీ చేతిలోంచి జారిపోతున్నా పట్టుకోకుండా పొట్ట చేత్తో పట్టుకు నవ్వుతున్న మీనాక్షి కనబడి, ఆశ్చర్యంతో బుగ్గమీద వేలేసుకుంది! ★